

అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం నివాళి

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని, దళితుల జీవితాల్లో మార్పు తెచ్చిన మహనీయుడని సీఎం సిద్దరామయ్య అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆయన అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. 7

దండకారణ్యంలో.. డాగ్ వాచ్..!



- పులుల అభయారణ్యంలో... నేరాల నియంత్రణకు శ్వానదళం
- స్మగ్లర్లకు, వేటగాళ్లకు చెక్ పెట్టడానికి అటవీ శాఖ నిర్ణయం
- పది నెలల శిక్షణ తర్వాత అటవీప్రాంతాలకు తరలింపు
- ఏటా 10 శ్వానాలకు శిక్షణ ● దేశంలోనే తొలి ప్రయోగం



బెంగళూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అడవుల్లో వన్యజీవులను వేటాడేవారిని, అక్రమంగా అటవీసంపదను దోచుకునే స్మగ్లర్లకు చెక్ పెట్టడానికి అటవీశాఖ ప్రత్యేక శిక్షణ ఇచ్చిన శునకాలను వాడనుంది. పోలీసుశాఖ నేరాలను గుర్తించేందుకు దశాబ్దాల కాలంగా శ్వానదళాన్ని ఉపయోగిస్తున్నారు. హత్యలు, దోపిడీలతోపాటు ఇతరత్రా భారీ నేరాలు జరిగిన వెంటనే ఫోరెన్సిక్ బృందాలతోపాటు శ్వానదళాలను రంగంలోకి దించి నేరస్థులను గుర్తించేందుకు వినియోగిస్తున్నారు. ఇకపై రాష్ట్రంలోని పులుల అభయారణ్యంలో జరిగే అక్రమాలు, వన్యజీవుల సంరక్షణకోసం అటవీశాఖ శ్వానదళాలను సిద్ధం చేస్తోంది. చామరాజనగర జిల్లా పరిధిలోని బండిపుర పులుల అభయారణ్యంలో ఇందుకోసమే శ్వానదళాల ప్రత్యేక శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. బెల్జియన్ షెపర్డ్ రకం శునకాలకు ఇక్కడ తర్ఫీదు ఇస్తున్నారు. అటవీశాఖ ద్వారా దేశంలోనే తొలి శ్వానదళ శిక్షణా కేంద్రం అవుతోంది. తొలిదశలో 12 శునకాలను ఇందుకోసం 20మంది సిబ్బందిని (స్నిప్పర్ డాగ్ కీపర్స్) బండిపుర పులుల అభయారణ్యంలోని మేలుకామనహళ్లి అడ్మిన్ బ్లాక్‌లో రిపోర్టు చేసుకున్నారు. వారు పదినెలలపాటు అభయారణ్యంలోనే ఉండి శిక్షణ పొందుతారు. ఆ తర్వాత పులుల అభయారణ్యానికి కేటాయిస్తారు. రాష్ట్రంలోని బండిపుర, నాగరహొళె, భద్ర, బిళిగిరి రంగనాథ టెంపుల్ (బీఆర్‌టీ), కాళి అభయారణ్యాలకు కేటాయించనున్నారు.

దొంగలను గుర్తించేలా శిక్షణ

శ్వానదళం అభయారణ్య ప్రదేశంలో వన్యజీవులను వేటాడేవారిని, అక్రమంగా అటవీసంపదను దోచుకునేవంటివారిని పసి గడతాయి. అడవులు, అభయారణ్యాలలో నేరాలను గుర్తించడంతోపాటు నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకునేందుకు కేటాయించనున్నారు. ఈ శిక్షణలో ప్రతి ఏటా 10 శునకాలకు శిక్షణ ఇస్తారు. తద్వారా రాష్ట్రంలోని అటవీ, వన్యజీవుల నేరగాళ్లను గుర్తించేందుకు వీలుంటుందని భావిస్తోంది. వన్యజీవి స్నిప్పర్, వన్యజీవి నేరాల ట్రాకింగ్ శ్వానాలుగా పిలుస్తారు. పోలీసుశాఖ ఈ శ్వానాలను ఉపయోగించుకోవడంలో కొన్నేళ్లుగా విజయవంతమైంది.

ట్రాకర్ డాగ్‌స్క్వాడ్ ట్రైనింగ్ సెంటర్

బండిపుర అటవీప్రాంతంలో శ్వానాల ద్వారా తనిఖీలు, వన్యజీవుల వేటగాళ్లను గుర్తించే ప్రక్రియ దశాబ్దాలుగా కొనసాగుతోంది. అయితే ప్రత్యేక విభాగం లేదు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా పులుల అభయారణ్య పరిధిలో శ్వానవిభాగాలలో శిక్షణ పొందిన వాటిని ఉపయోగిస్తారు. గతంలో అటవీశాఖ బండిపుర పులుల అభయారణ్యంలో ట్రాఫిక్, డబ్లుడబ్ల్యుఎఫ్ ఇండియా సంస్థ ద్వారా స్నిఫర్ డాగ్‌లను సరఫరా చేసేది. వీటికి ఏడెనిమిది నెలలపాటు హర్యానాలోని పంచకులలో ఇండో టిబెటియన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ) శిక్షణా కేంద్రంలో నైపుణ్యత ఇచ్చేవారు. ప్రస్తుతం బండిపుర అభయారణ్యంలో ద్రోణ అనే స్నిప్పర్ డాగ్ ద్వారా ఈ గ్రూప్‌లో చేరింది. 'ట్రాకర్ డాగ్ స్క్వాడ్ ట్రైనింగ్ సెంటర్' ఏర్పాటు చేశారు. 2023లో శిక్షణ పొందిన తర్వాత బండిపుర అటవీప్రాంతంలో సేవలకు కేటాయించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 5 పులుల అభయారణ్యాలు ఉన్నాయి. వన్యజీవి, అటవీ ప్రాంతాలలో నేరాల నియంత్రణను గుర్తించేందుకు సిబ్బంది పనిచేస్తున్నారు. వారి పర్యవేక్షణలో కుక్కలను ఉపయోగించుకునేలా ప్రక్రియ ఆరంభించారు. ప్రస్తుతానికి బండిపుర అభయారణ్యానికి పరిమితమైనా రానున్న రోజుల్లో ఇతరత్రా పులుల అభయారణ్యాలకు విస్తరింపచేయదలిచారు. శ్వానదళాలకు శిక్షణ కూడా ఎక్కడికక్కడ అభయారణ్యంలోనే ఇప్పించే ఆలోచన ఉన్నట్లు అటవీ సంరక్షణాధికారి, పులుల ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ పీ రమేశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. శ్వానదళాన్ని ఉపయోగించుకునే విషయంలో వ్యవస్థీకృతంగా ప్రణాళిక చేశామన్నారు. శ్వానదళాలకు శిక్షణ ఇచ్చి అటవీసంపదను, వన్యప్రాణులకు రక్షణ కల్పించాలన్నదే తమ ఆశయమన్నారు.


బండిపుర అభయారణ్యంలో శిక్షణ పొందుతున్న శునకాలతో సిబ్బంది



బండిపుర పులుల అభయారణ్య ప్రవేశద్వారం

బాలింతల మృతి.. బాధ్యులపై చర్యలు తప్పవు..!

- సీఎం హెచ్చరిక ● తప్పు నాదైతే మంత్రి పదవికి రాజీనామా చేస్తా: దినేశ్ గుండూరావు
- దర్యాప్తు జరిపించాలని లోకాయుక్తకు బీజేపీ ఫిర్యాదు ● బళ్లారిలో మరో బాలింత మృతి

బెంగళూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బళ్ళారి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వరుస బాలింతల మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని సీఎం సిద్దరామయ్య ఆదేశించారు. బాలింతల మృతిపై శుక్రవారం కేబినెట్ భేటీలో సీఎం చర్చించారు. తప్పు చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రిలో మృతి చెందిన బాలింత సంఖ్య ఆరుకు చేరడంపై సీఎం మండిపడ్డారు. బాలింతలకు ఐవీ రింగర్ ల్యాక్టేట్ ద్రావణం (ఒక రకమైన సెలైన్) ఇవ్వడం సరికాదని రాష్ట్ర డ్రగ్స్ అండ్ లాజిస్టిక్స్ వేర్‌హౌసింగ్ నివేదికలో సూచించినా అదే ద్రావణాన్ని ఇవ్వడమే మృతికి కారణమని సమగ్ర విచారణ జరపాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్‌ను ఎటువంటి చర్యలు తీసుకున్నారని సీఎం ప్రశ్నించారు. బాధిత కుటుంబాలను పరామర్శించాలని, నిర్లక్ష్యం సరి కాదని మందలించారు.

రాజీనామాకైనా సిద్ధం..

కాగా బళ్ళారి ఆసుపత్రిలో బాలింతల మృతిలో తన తప్పు ఉంటే రాజీనామాకు వెనుకాడేది లేదని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు తెలిపారు. శుక్రవారం విధానసౌధలో మీడియాతో మాట్లాడుతూ బాలింతల మృతి అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా భావిస్తోందన్నారు. మృతికి చెందినవారికి ఇతరత్రా ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు వైద్యుల ద్వారా తెలుస్తోందన్నారు. బీజేపీ ఆరోపణల వెనక నిజాలు లేవన్నారు. నిజాలు విచారణలో తేలుతాయన్నారు.


లోకాయుక్తకు ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

చర్యలు తీసుకోవాలి..

బాలింతల మృతిపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దినేశ్ గుండూరావు రాజీనామా చేయాలని, సమగ్ర దర్యాప్తు జరిపించాలని బీజేపీ పరిషత్ ప్రతిపక్షనేత ఛలవాది నారాయణస్వామి, ఎమ్మెల్సీ రవికుమార్, మహిళా మోర్చా అధ్యక్షురాలు మంజుళ, జయనగర్ ఎమ్మెల్యే రామమూర్తితోపాటు పలువురు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ బాలింతలు, శిశువుల మృతి పట్ల ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించడం లేదన్నారు. నిర్లక్ష్యం వహిస్తున్న మంత్రి రాజీనామా చేయాలన్నారు. నాసిరకం మందులు కొనుగోలుపై దర్యాప్తు చేయాలని లోకాయుక్తను కోరామన్నారు.

మరో బాలింత మృతి

- ఆరుకు చేరిన మృతుల సంఖ్య


సుమయ భాను(ఫైల్)

బళ్లారి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బళ్లారి ఆసుపత్రిలో మరో బాలింత మృతి చెందింది. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత కూడ్లిగి కి చెందిన సుమయ భాను(25) కన్నుమూశారు. వైద్యులు తెలిపిన వివరాల మేరకు కూడ్లిగికి చెందిన సుమయభాను(25) నవంబర్ 11న జిల్లా ఆసుపత్రిలో కాన్పు కోసం చేరింది. ఆమెకు సిజేరియన్ ఆపరేషన్ చేసి ప్రసవం చేశారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను మరుసటి రోజు బళ్లారి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (విమ్స్)లో చేర్పించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె 24రోజులుగా ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నారు. దాదాపు కోలుకున్నప్పటికీ కిడ్నీ సమస్య పరిష్కారం కాలేదు. తదుపరి చికిత్స కోసం బెంగళూరుకు తీసుకెళ్లాలని విమ్స్ వైద్యుల బృందం నిర్ణయించారు. అయితే చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. ఒక్కసారిగా రక్తపోటు తగ్గిందని, లైఫ్ సపోర్టు, పీసీఆర్ ఉన్నప్పటికీ తుది శ్వాస విడిచినట్లు విమ్స్ డైరెక్టర్ గంగాధరగౌడ్ తెలిపారు. ఈమె మృతితో బాలింతల మృతి ఆరుకు చేరింది. ఆమెకు ఇది రెండో కాన్పు. దాదాపు 25 రోజులు పోరాడి చివరకు మృత్యువు చేతిలో ఓడింది. ఆమెకు ఇది రెండో కాన్పు తొలికాన్పు ఆడబిడ్డ, రెండో కాన్పు మగపిల్లాడు పుట్టాడు. ఆమె మృతితో చిన్నారులు తల్లిని కోల్పోయారు. ఆమే భర్త అబ్దుల్ రహిమాన్, సుమయాది అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండల కేంద్రం. ఆమెను కూడ్లిగి తాలూకా లోని అబ్దుల్ రహిమాన్‌కు ఇచ్చి వివాహం చేశారు. బాలింత మృతితో తల్లి పాలు కోసం గుక్కపట్టి రోదిస్తుంటే చూసిన వారు అయ్యోపాపం చిన్నారులు అంటూ కంటతడి పెట్టారు. కొందరు బళ్లారి ఆసుపత్రిలో సరిగ్గా వైద్యం అందలేక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లిపోయారు. అక్కడ కూడా అనంతపురం జిల్లా రాయదుర్గంకు చెందిన శ్రీగౌరి(32) బాలింత నవంబరు 22 కన్నుమూశారు. బాలింతల మృతితో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లడానికి గర్భిణీలు జంకుతున్నారు.


సుమను విమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం(ఫైల్)


సదస్సును ప్రారంభిస్తున్న మంత్రి ప్రియాంక ఖర్గే

విద్యార్థులను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దండి

- ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే

7



ఇన్వర్టర్ పేలి ఇల్లు దగ్ధం

బళ్లారి నగర పరిధిలోని హలకుంది గ్రామంలోని ఓ ఇంట్లో ఇన్వర్టర్ పేలి ఇంట్లోని సామగ్రి దగ్ధం అయ్యింది. అగ్ని మాపక సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో భారీ ప్రమాదం తప్పింది 9

ఇంట్లో కాలిపోయిన వస్తువులు


మీడియాతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు 9

రైతు సమస్యల పరిష్కారానికై 9న చలో బెళగావి

అధికార పంపిణీ ఒప్పందం వాస్తవమే

- మంత్రి మునియప్ప



బెంగళూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అధికార పంపిణీ ఒప్పందం వాస్తవమేనని డీసీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యలకు బలం చేకూర్చేలా పౌర, ఆహార సరఫరాలశాఖ మంత్రి మునియప్ప తెలిపారు. శుక్రవారం కోలారులో మంత్రి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార ఒప్పందానికి సంబంధించి ఒప్పందం జరిగిందన్నారు. డీసీఎం డీకే శివకుమార్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు వాస్తవమేనన్నారు. అంతకుమించి మరే విషయాలు అడగరాదని దాటవేశారు. దీన్నిబట్టి డీసీఎం డీకే శివకుమార్ ఢిల్లీలో ఓ మీడియా ఇంటర్వ్యూలో ప్రస్తావించిన అంశాలు వాస్తవమని మునియప్ప ద్వారా బహిరంగమైంది. అయితే సీఎం సిద్దరామయ్య మాత్రం అటువంటి ఒప్పందాలు ఏవీ లేవని అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడతామన్నారు. సీఎం, డీసీఎంల వ్యాఖ్యలు భిన్నంగా ఉండగా మంత్రి మునియప్ప వ్యాఖ్యలతో ముఖ్యమంత్రి మార్పు ఉందనేది స్పష్టమైంది. కానీ అధికార పంపిణీలో ఒప్పందం జరిగి ఉంటే వారిద్దరే రాజకీయాలు చేసుకోవచ్చునని, మేమంతా ఎందుకంటూ హోం మంత్రి పరమేశ్వర్ అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.

విద్యార్థులకు విమాన యోగం..!

- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ప్రోత్సహిస్తున్న ఉపాధ్యాయులు ● కొప్పళ, మాగడి, శివమొగ్గ విద్యార్థుల ఆనందం


బెంగళూరు ఎయిర్ పోర్టులో చిత్రదుర్గ విద్యార్థులు


విమానంలో కొప్పళ విద్యార్థులు

బెంగళూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు విమానయానం కల్పించడం ద్వారా వారిలో సంతోషాన్ని పెంచేలా ఉపాధ్యాయులు వ్యవహరిస్తున్నారు. శుక్రవారం రాష్ట్రంలో కొప్పళ, మాగడి, శివమొగ్గ ప్రాంతాలకు చెందిన విద్యార్థులకు విమాన ప్రయాణం కలిగింది. జిల్లా కేంద్రమైన కొప్పళ సమీపంలోని లింగదహళ్ళి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులను హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. తొలుత విద్యార్థులనుంచి రూ.2వేలు చొప్పున వసూలు చేశారు. నాలుగురోజులపాటు హైదరాబాద్‌ను సందర్శించాల్సి ఉన్నందున అదనపు ఖర్చులు వస్తాయన్నారు. అంతకుమించి విద్యార్థులతో వసూలు చేయడం సాధ్యం కాదని ఉపాధ్యాయులు, గ్రామస్థులు చందాలు వేసుకుని కొంత నగదు సమకూర్చారు. ఇలా శుక్రవారం బళ్ళారిలోని జిందాల్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చి విద్యార్థులే బోర్డింగ్ పాస్ తీసుకుని విమానంలోకి ప్రవేశించారు. ఎమ్మెల్యే రాఘవేంద్ర హిట్నాళ్ విద్యార్థుల ప్రయాణానికి జెండా ఊపి వీడ్కోలు పలికారు.

చిత్రదుర్గ జిల్లా హొసదుర్గ తాలూకా మారగబెట్ట యూపీ స్కూల్‌కు చెందిన 19మంది విద్యార్థులను ముగ్గురు ఉపాధ్యాయులు శివమొగ్గ నుంచి బెంగళూరుకు విమానంలో తీసుకొచ్చారు. బెంగళూరులో రెండు రోజులపాటు విధానసౌధ, హైకోర్టు, విశ్వేశ్వరయ్య మ్యూజియం, నెహ్రూ ప్లానెటోరియం, బన్నేరుఘట్ట జూలను సందర్శింపచేస్తామని ఉపాధ్యాయులు తెలిపారు.

కాగా రామనగర జిల్లా మాగడి తాలూకా హరశూరు గ్రామం వీరభద్రేశ్వర హైస్కూల్ ఉపాధ్యాయులు రాజణ్ణ 51మంది విద్యార్థులు, 8మంది తోటి ఉపాధ్యాయులకు సొంత ఖర్చులతో మహారాష్ట్రకు విమానంలో తీసుకెళ్లారు. ఇందుకు జీతం ద్వారా కొంతకాలంగా పొదుపు చేసుకున్న రూ.2.67లక్షలను ఖర్చు చేశారు. బెంగళూరు ఎయిర్ పోర్ట్ నుంచి పూనెకు తీసుకెళ్లారు. అక్కడనుంచి షిర్డీ, అజంతా, ఎల్లోరా, కొల్హాపురతోపాటు పలు పర్యాటక ప్రాంతాలను సందర్శింపచేశారు.

15నుంచి జాతీయస్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలు

బెంగళూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15నుంచి జాతీయస్థాయి టేబుల్‌టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు గౌరవాధ్యక్షుడు రక్షారామయ్య తెలిపారు. నగరంలో శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. అండర్11, 13, 15, 17, 19 విభాగాలలో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు ఉంటాయన్నారు. 1500మంది అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ పోటీల్లో పాల్గొంటారని, ప్రైజ్‌మనీ రూ.9.99 లక్షలు ఉంటుందన్నారు. కంఠీరవ స్టేడియంలో పోటీలు జరుగుతున్నాయన్నారు.

మాజీ ఎమ్మెల్యే మాడాళ్ లంచావతారం

- వాట్సప్ చాటింగ్‌లో బహిర్గతం


మాడాళ్ విరూపాక్షప్ప


ప్రశాంత్‌కుమార్

బెంగళూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సోప్స్ అండ్ డిటెర్జెంట్స్ కార్పొరేషన్ ద్వారా టెండరు ప్రక్రియలో చైర్మన్‌గా వ్యవహరించిన బీజేపీ మాజీ ఎమ్మెల్యే మాడాళ్ విరూపాక్షప్ప కుమారుడు జలమండలి అధికారి ప్రశాంత్‌కుమార్ ద్వారా లంచం తీసుకున్నారని లోకాయుక్త పోలీసులు కోర్టుకు చార్జ్‌షీట్ ద్వారా వివరించారు. ప్రశాంత్‌కుమార్ టెండరు ప్రక్రియలో జోక్యం చేసుకుని రసాయనాలు సమకూర్చినవారి నుంచి 90 లక్షల రూపాయలు లంచం తీసుకున్నారని విచారణలో రుజువైందని కోర్టుకు గురువారం చార్జ్‌షీట్ సమర్పించారు. జలమండలి అధికారి ప్రశాంత్‌కుమార్ అలియాస్ ప్రశాంత్ మాడాళ్ కర్ణాటక అరోమాస్ కంపెనీకి చెందిన ముగ్గురు సిబ్బందిపై చార్జ్‌షీట్‌లో అక్రమాలకు పాల్పడినట్లు నమోదు చేశారు. లంచానికి సంబంధించి వాట్సప్ చాట్‌లో రుజువైందని, చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. అరోమాస్ కంపెనీ వినయ్‌రాజ్, ఇతర కంపెనీల శాంపిల్స్‌ను తిరస్కరించాలని ప్రశాంత్‌కు పంపిన వాట్సప్ మెసేజ్‌ను గుర్తించినట్లు చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. సోప్స్ అండ్ డిటెర్జెంట్స్ ఎండీ డాక్టర్ మహేష్‌కు వాట్సాప్ ద్వారా ఎకస్‌పీ కంపెనీ సుగంధ ద్రవ్యాలను తిరస్కరించండి అనే మెసేజ్ పంపడం ద్వారా టెండర్‌ల ప్రక్రియపై ప్రభావం చూపారని రుజువైనట్లు చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. దీంతో మాడాళ్ విరూపాక్షప్పతో పాటు ప్రశాంత్‌కు మార్‌లు అవినీతికి పాల్పడినట్లుగా అధికారులు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో మహిళ మృతి


వరలక్ష్మి (ఫైల్)

తాడిపత్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన వరలక్ష్మి (54) విద్యుత్‌షాక్‌తో శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. వరలక్ష్మి, ఓబులేసుయాదవ్ దంపతులు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరు ఆవులు కూడా పెంచుతున్నారు. ఆవులకు ప్రతిరోజూ వరలక్ష్మి రైస్‌కుక్కర్‌పై అన్నం వండి పెడుతుండేది. ఇందులో భాగంగానే శుక్రవారం తెల్లవారుజామున నిద్రలేచి ఆవులకు అన్నం పెట్టేందుకు రైస్ కుక్కర్‌పై అన్నం పెట్టింది. అన్నం ఉడికిన తర్వాత పక్కకు పెట్టాలన్న ఆలోచనతో మూతతీసేందుకు ప్రయత్నించింది. ఒక్కసారిగా విద్యుత్ ప్రసరించడంతో షాక్ కొట్టింది. అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయింది. గమనించిన భర్త చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వరలక్ష్మికి కుమారుడు సందీప్‌కుమార్, కుమార్తె మంజులభార్గవి ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

కూలీ ఆత్మహత్య

అనంతపురం క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసైన ఓ కూలీ ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురం రూరల్ మండలం పాముురాయికి చెందిన రామాంజనేయులు (29) కూలి పనిచేస్తూ జీవిస్తున్నాడు. కొంతకాలంగా తాగుడుకు బానిసయ్యాడు. ఎంత ప్రయత్నించినా మానలేకపోయాడు. ఈ క్రమంలో మనస్తాపంచెంది శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతుడికి భార్య సంధ్య, రెండేళ్ల పాప ఉన్నారు. అనంతపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం


భానుప్రకాష్ (ఫైల్)

గార్లదిన్నె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్తాడు గ్రామానికి చెందిన కుమ్మర భానుప్రకాష్ అనే యువకుడు కనిపించకుండా పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. గ్రామానికి చెందిన కుమ్మర రాము, భాగ్యమ్మ దంపతులు గ్రామంలోనే కులవృత్తి చేసుకుంటూ జీవించేవారు. కుమ్మర రాము కొంతకాలం కిందట మృతి చెందాడు. ఇంటర్ వరకు చదివిన భానుప్రకాష్ తల్లికి తోడుగా ఇంటివద్దనే కుమ్మర వృత్తిని చేస్తుండేవాడు. రెండు రోజుల కిందట భాగ్యమ్మ గుంతకల్లులో బంధువుల ఇంట్లో జరుగుతున్న శుభకార్యానికి వెళ్లింది. తర్వాత ఆమె ఇంటికి తిరిగా రాగా కుమారుడు భానుప్రకాష్ కనిపించలేదు. దీంతో గ్రామంలోను, బంధువుల ఊళ్లలోనూ వెదికినా ఆచూకి కనిపించకపోవడంతో గురువారం రాత్రి గార్లదిన్నె పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు.

పెళ్లిలో చోరీ

- 38 తులాల వడ్డాణాల అపహరణ

పామిడి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెన్నానది ఒడ్డున ఉన్న ఓ ఫంక్షన్ హాలులో శుక్రవారం జరుగుతున్న పెళ్లిలో చోరీ జరిగింది. సీఐ యుగంధర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని రామరాజుపల్లి గ్రామానికి చెందిన విశ్వనాథరెడ్డి కుమార్తె రోషిణి వివాహం పెన్నానది ఒడ్డున ఉన్న ఓ ఫంక్షన్ హాలులో జరుగుతోంది. పెళ్లి కుమార్తె అక్క శృతికి చెందిన రూ.25లక్షల విలువైన 38 తులాల రెండు వడ్డాణాలు చోరీకి గురైనట్లు సీఐ తెలిపారు. రాత్రి రిసెప్షన్‌కు వేసుకొని గదిలో భద్రపరిచిందన్నారు. ఉదయం కనిపించకపోవడంతో భయాందోళనకు గురయ్యారన్నారు. సింగిల్ విండో మాజీ డైరెక్టర్ ఆర్‌సీ వెంకట్రామిరెడ్డి ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదుపై వెంటనే స్పందించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో బీజేపీ నాయకుడి మృతి

హిందూపురం అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీజేపీ నాయకుడు అంజినరెడ్డి గురువారం మృతి చెందారు. రెండు రోజుల క్రితం తన పొలంలో నుంచి మడకశిర జాతీయ రహదారిపైకి ద్విచక్ర వాహనంలో రావడంతో అటుగా ద్విచక్రవాహనంపై ముగ్గురు యువకులు వేగంగా వచ్చి ఢీకొట్టారు. ఈ ఘటనలో అంజినరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. బెంగళూరుకు తరలించి చికిత్సలు అందించగా ఫలించక మృతి చెందారు. మృతదేహానికి సొంత గ్రామమైన సింగిరెడ్డిపల్లిలో శుక్రవారం అంత్రక్రియలు నిర్వహించారు. అంజనరెడ్డి హిందూపురం అసెంబ్లీ బీజేపీ కన్వీనర్‌గా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పార్టీకి సేవచేశారు. బీజేపీ నాయకులు పార్థసారథి, రమేష్‌రెడ్డి, చంద్రశేఖర్, ఆదర్శ్, దివాకర్, చలపతి, చంద్ర, చంద్రశేఖర్, బద్రీ, వెంకటనరామిరెడ్డి తదితరులు హాజరై బీజేపీ జెండా మృతదేహంపై కప్పి నివాళులర్పించారు.


నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పుట్టిన తేదీతో... పుట్టెడు కష్టాలు..!

- పేరు, పుట్టిన తేదీ మార్పునకు ఇబ్బందులు
- ఆధార్ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ
- పట్టించుకోని అధికారులు

గుత్తి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన అపార్ కార్డు విద్యార్థులు వారి తల్లిదండ్రులను ముప్పు తిప్పలు పెడుతోంది. ఆరువారాలుగా పాఠశాల, గ్రామసచివాలయాలు, తహసీల్దార్, కార్యాలయాలు, ఆధార్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నా సమస్య పరిష్కారం కావడం లేదు. పాఠశాల రికార్డుల్లోనూ, ఆధార్‌కార్డులోనూ, ఒకేవిధంగా వివరాలుంటేనే అపార్ కార్డు జనరేట్ అవుతోంది. ఈ రెండు చోట్ల వివరాలు ఒకే విధంగా మార్పు చేయడానికి విద్యార్థులు, తల్లిదండ్రులు అన్ని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకపోవడంతో వారి చదువులు వెనకబడుతున్నాయి. పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఒత్తిళ్లు తెస్తుండటంతో వారు ఏం చేయాలో అర్థంకాక అయోమయంలో పడుతున్నారు. అపార్ కార్డు జనరేట్ కావాలంటే పాఠశాల రికార్డుల్లోనూ, ఆధార్‌కార్డులోనూ ఇంటి పేరు ఒకేరకంగా ఉండాలి. సాధారణంగా పాఠశాలలో ఇంటిపేరుతో పాటు విద్యార్థి పేరు ఉంటుంది. కానీ ఆధార్‌కార్డులో వచ్చేపాటికి ఆ సమయంలో ఎక్కువ మంది ఇంటిపేరు పూర్తిగా కాకుండా మొదటి అక్షరం ఇన్షియల్ మాత్రమే పెట్టి నమోదు చేయించుకున్నారు. ప్రస్తుతం అపార్ కార్డు జనరేట్ కావాలంటే ఈ రెండు ఒకేరంగా ఉండాలి. చాలా మందికి రెండు చోట్ల ఒకే రకంగా పేరు ఉండకపోవడంతో అపార్ కార్డులు జనరేట్ కావడం లేదు. ఇంటిపేరు మార్చుకోవాలంటే మొదట జనన ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. ఆ పత్రం కోసం సచివాలయంలో వివరాలు రాసిస్తే వారు తహసీల్దార్‌కు పంపుతారు. అక్కడ నమోదై ఉంటే ధ్రువీకరణ పత్రం ఇస్తారు. ఒకవేళ విద్యార్థి పుట్టినపుడు ఎక్కడా నమోదు చేయకపోతే నాన్ అవైలబుల్ అనే సర్టిఫికెట్‌ను ఆర్డీఓ జారీ చేస్తారు. అక్కడి నుంచి తిరిగి సచివాలయం, తహసీల్దార్ కార్యాలయానికి పంపితే అక్కడ జనన ధ్రువీకరణ పత్రం ఇంటిపేరుతో ఇస్తారు. ఈతంతంగం పూర్తి కావాలంటే కనీసం 15 నుంచి 20 రోజులు పడుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.


ఆధార్ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు


న్యాయవాది వద్ద అఫిడవిట్ కోసం బారులుతీరిన తల్లిదండ్రులు

ఇబ్బందులు పడతున్నాం



ఇంటిపేరు ఆధార్‌కార్డులో తప్పు ఉండడంతో సరి చేసేందుకు రెండు రోజులుగా ఆధార్ కేంద్రం వద్దకు వస్తున్నా. బర్త్ సర్టిఫికెట్ కోసం గుత్తి మున్సిపాలిటీలో ఇవ్వడంతో ఇంటిపేరు కుడా ఇక్కడే మార్చుకోవాలని ఆధార్ సెంటర్‌వారు చెబుతున్నారు. ఇక్కడ మున్సిపాలిటీలో పనికావడంలేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం.

- పెద్దక్క, గుత్తి అనంతపురం

నాలుగుసార్లు తిరిగినా పని కావడంలేదు



నాకుమారుడు ఇక్కడే పుట్టాడు. అప్పట్లో నల్లదాసరిపల్లి అని కొట్టకుండా కొజ్జేపల్లి అని జనన ధ్రువీకరణ పత్రంలో ముద్రించారు. ఇప్పటికీ గుంతకల్లు నుంచి నాలుగుసార్లు తిరిగినా పనికావడం లేదు. ఎప్పుడు వచ్చినా చూస్తామంటారు కానీ పని మాత్రం చేయలేదు. పనులు వదులుకొని తిరుగతుఉన్నాం.

- ప్రసాద్, నల్లదాసరిపల్లి

సందిగ్ధం..!

- కొత్త రేషన్‌కార్డుల జారీపై స్పష్టత కరువు
- సచివాలయాలకు వెళ్తున్న అర్హులు
- దరఖాస్తులు స్వీకరించని వైనం
- మార్గదర్శకాలు రాలేదంటున్న సిబ్బంది

ధర్మవరం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కొత్త రేషన్ కార్డుల జారీపై సందిగ్ధం నెలకొంది. ప్రభుత్వం ఈనెల 2వతేదీ నుంచి సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించనున్నట్లు ఇదివరకే ప్రకటించింది. దీంతో ఆశావహులు సచివాలయాలకు పెద్దసంఖ్యలో చేరుకుని, దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సచివాలయాల్లో వారం రోజులుగా ఇందుకు సంబంధించిన యాప్ ఓపెన్ కాకపోవడం, ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు సైతం రాకపోవడంతో ఆశావహులకు ఏం చెప్పాలో తెలియని అయోమయ పరిస్థితిలో సచివాలయ సిబ్బంది ఉంటున్నారు.

సంక్రాంతికి కొత్తకార్డులంటూ..

డిసెంబరు 2 నుంచి 28వ తేదీ వరకూ అన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త రేషన్‌కార్డుల జారీ, మార్పులు, చేర్పులకు ప్రభుత్వం అవకాశం కల్పించబోతోందనీ, కొత్త డిజైన్లతో పంపిణీ చేయనుందని కొన్ని రోజులుగా అధికార యంత్రాంగం ప్రచారం చేస్తోంది. సంక్రాంతి పండుగకే కొత్త కార్డులు అందజేస్తుందని కూడా కొందరు పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కాలేదు. దీంతో దరఖాస్తుదారులకు ఏం చెప్పాలోనని సచివాలయ సిబ్బంది వాపోతున్నారు. దరఖాస్తులు స్వీకరించాలో.. వద్దో కూడా తెలియని పరిస్థితి.

పది నెలలుగా పెండింగ్

పది నెలలుగా కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తులను గ్రామ, వార్డు సచివాలయాల్లో స్వీకరించడంలేదు. ఇందుకు సంబంధించి ఈ-పోస్ సైట్‌ను బ్లాక్ చేశారు. జనవరి, ఫిబ్రవరి నెలల్లో వచ్చిన దరఖాస్తులు వందల్లో పెండింగ్‌లో ఉన్నట్లు జిల్లా పౌరసరఫరాల అధికారుల ద్వారా తెలుస్తోంది. ఆ తరువాత ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రేషన్ కార్డులకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించడం లేదు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. వైసీపీ రంగులతో ఉన్న రేషన్‌కార్డులను తొలగించాలని నిర్ణయించింది. గత టీడీపీ హయాంలో జారీ చేసిన రేషన్ కార్డుల్లో మొత్తం కుటుంబసభ్యుల ఫొటో ఉండేది. అలానే కుటుంబ పెద్ద, వృత్తి, పుట్టినతేదీ, వయసు, వార్షికాదాయం వంటి వివరాలు ఉండేవి. గత వైసీపీ ప్రభుత్వం వాటిని తొలగించి, రైస్‌కార్డులంటూ సచివాలయాల ద్వారా పంపిణీ చేసింది. ఆ కార్డుల్లో కుటుంబసభ్యుల ఫొటో తీసేసింది. ఆ కుటుంబంలో మహిళ ఫొటోను మాత్రమే ఉంచింది. ఆ కార్డులను గుర్తింపు కార్డులుగా పరిగణించలేని పరిస్థితి.



నిరాశగా వెనుదిరుగుతూ..

కొత్తకార్డులు, స్ప్లిట్‌కార్డులు, ఇతర సవరణల కోసం పెట్టుకున్న దరఖాస్తులను గత ప్రభుత్వం నిలిపివేసింది. ఆరంచెల పరిశీలన ద్వారా వేలల్లో కార్డులను తొలగించింది. ఈ కారణంగా ఇప్పుడు వంటగ్యాస్ సబ్సిడీకి కూడా కొందరు దూరమయ్యారు. ఇతర సంక్షేమ పథకాలను పొందలేకపోయారు. శ్రీసత్యసాయి జిల్లాలో 5.72 లక్షల రేషన్‌కార్డులున్నాయి. ఇంకా అర్హులు మిగిలిపోవడంతో వారికి కార్డులు పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అందుకు సంబంధించి మార్గదర్శకాలు ప్రకటించలేదు. దీంతో సచివాలయాలకు దరఖాస్తులతో వస్తున్నవారు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

మార్గదర్శకాలు రాలేదు: వంశీకృష్ణారెడ్డి, డీఎస్‌ఓ

రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించి ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ కాలేదు. దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు రాగానే ప్రక్రియ ప్రారంభిస్తాం.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

ఓబుళదేవరచెరువు, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండలంలోని బోయపల్లి క్వార్టర్స్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో కదిరి పట్టణంలోని నిజాంవలీకాలనీకి చెందిన బీటెక్ విద్యార్థి తరుణ్‌సాయి (22) మృతిచెందాడు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తరుణ్‌సాయి బెంగుళూరులో బీటెక్ చదువుతుండేవాడు. గురువారం రాత్రి గోరంట్లకు చెందిన స్నేహితుడు ఉమేష్‌ను ద్విచక్రవాహనంపై వదిలి వెళ్లడానికి కదిరి నుంచి బయల్దేరాడు. బోయపల్లి వద్ద అదుపు తప్పి బైక్ బోల్తా పడింది. ప్రమాదంలో తరుణ్‌సాయి తలకు తీవ్రగాయాలయ్యాయి. కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ తరుణ్‌సాయి మృతిచెందాడు. విద్యార్థి తల్లి అనిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించారు. ఉమేష్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

ముగిసిన రైల్వే ఎన్నికల పోలింగ్

గుంతకల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగ సంఘం గుర్తింపు ఎన్నికల్లో భాగంగా పోలింగ్ ప్రక్రియ పూర్తయింది. 4వ తేదీన దేశవ్యాప్తంగా రైల్వే ఉద్యోగ సంఘం గుర్తింపు కోసం ఎన్నికలను నిర్వహించారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో 34, డివిజనల్ కేంద్రంలో 6 పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేశారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు పోలింగ్ కార్యక్రమం పూర్తయింది. మొత్తం 14,359 ఓట్లకు 12,358 ఓట్లు పోలయ్యాయి. 2001 ఓట్లు పోల్ కాలేదు. పోలింగ్‌లో 11,509 మంది పురుష ఓటర్లు, 849 మంది మహిళా ఓటర్లు ఓట్లువేశారు. 86.06 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులైన పర్సనల్ బ్రాంచ్ ఆఫీసర్లు తెలిపారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి
- రూరల్ క్రికెట్ లీగ్‌లో సెంచరీల మోత

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నప్పుడే సత్ఫలితాలు వస్తాయని క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి అన్నారు. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్తంగా శుక్రవారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో అండర్-12 మిక్స్‌డ్ రూరల్ క్రికెట్ లీగ్-2024 క్వాలిఫయర్ మ్యాచ్‌లు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన పీఎల్ ప్రకాష్‌రెడ్డి పోటీలను ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల క్రీడాకారులకు అవకాశం కల్పించేందుకే ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆంధ్రా, భారత్ జట్టుకు ప్రాతినిధ్యం కల్పించడమే లక్ష్యంగా క్రీడాకారులు, కోచ్‌లు, సభ్యులు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. అనంతరం నిర్వహించిన అండర్-12లో మ్యాచ్‌లో రాప్తాడు, గుత్తి జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన గుత్తి 19.1 ఓవర్లలో 51పరుగులకే ఆలౌట్ అయ్యింది. తరుణిక, కాత్యాయని, ధన్యుత చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం స్వల్పలక్ష్యంతో బరిలోకి దిగిన రాప్తాడు 4.1ఓవర్లలో వికెట్ నష్టపోకుండా విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో ఆత్మకూరు, ధర్మవరం జట్ల మధ్య జరిగిన పోరులో మొదట బ్యాటింగ్ చేసిన ధర్మవరం నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టానికి 157 పరుగులు చేసింది. బ్యాటర్ గోవర్ధన్ 98 బంతుల్లో 12 బౌండరీలు, 12 సిక్సర్లతో 139 పరుగులు చేశాడు. అనంతరం బరిలోకి దిగిన ఆత్మకూరు 19.1 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 161 పరుగులు సాధించింది. ఇందులో గౌతమ్ 46పరుగులు చేశాడు. దీంతో ఆత్మకూరు 6వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో తపోవనం క్రికెట్ అకాడమీ, గుంతకల్లు రైల్వేస్‌జట్లు తలపడగా టీసీఏ 40ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి 307పరుగులు సాధించింది. కౌశిక్ 100పరుగులు, తన్మయి కార్తిక్‌రెడ్డి కేవలం 26బంతుల్లోనే 8బౌండరీలు, 6సిక్సర్లతో 77పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బరిలోకి దిగిన గుంతకల్లు రైల్వేస్ 33.4ఓవర్లలో 155పరుగులకు ఆలౌట్ అయ్యింది. దేవస్కంద, కుశాల్‌రాయల్ చెరో 3వికెట్లు పడగొట్టారు. తపోవనం క్రికెట్ అకాడమీ జట్టు 152 పరుగుల తేడాతో గెలుపొందింది. కార్యక్రమంలో చిత్తూరు క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విజయ్ కుమార్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి, మేనేజర్ సాగర్‌చౌదరి, కోచ్‌లు వంశీకృష్ణ, ప్రవీణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఎల్ ప్రకాష్ రెడ్డి


సెంచరీలు సాధించిన గోవర్దన్, కౌశిక్, తన్మయి కార్తీక్

అంబేడ్కర్‌కు టీడీపీ నివాళి


అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ ఇతర నాయకులు

అనంతపురం డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం టీడీపీ నాయకులు నిర్వహించారు. నగరంలోని జడ్పీ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, మాజీ మేయర్ స్వరూప, ఇతర నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాతగా అంబేడ్కర్ తరతరాలకు గుర్తుండిపోయే సేవలను అందించారని కొనియాడారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో జగన్‌రెడ్డి రాజ్యాంగం అమలు చేసి అన్ని వ్యవస్థలను విచ్ఛిన్నం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలారి ఆదినారాయణ, బుగ్గయ్య చౌదరి, గంగారామ్, విశాలాక్షి, స్వప్న, సరిపూటి రమణ, కూచి హరి పాల్గొన్నారు.


నివాళి అర్పిస్తున్న మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తదితర నాయకులు

రైల్వే మెయిల్ సర్వీస్‌ను నిర్వీర్యం చేయడం తగదు


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

గుంతకల్లుటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎంతో చరిత్ర కలిగిన రైల్వే మెయిల్ సర్వీస్‌ను నిర్వీర్యం చేయడం తగదని నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి జనార్దన్, యూనియన్ డివిజనల్ కార్యదర్శి జే శ్రీనివాసులు అన్నారు. మొదీనబాదులోని రైల్వే మెయిల్ సర్వీస్ కార్యాలయం వద్ద శుక్రవారం నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఇప్పటికే పోస్టల్ స్టోర్ డిపోను విజయవాడకు, సూపరింటెండెంట్ పోస్టాఫీసెస్‌ను అనంతపురానికి తరలించారని అన్నారు. ప్రస్తుతం రైల్వే మెయిల్ సర్వీస్‌ను ఇతర ప్రాంతాకు తరలించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. అధికారులు వెంటనే ఈ ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకండి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివప్రసాద్


మాట్లాడుతున్న న్యాయాధికారి

అనంతపురం క్రైం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల నమ్మకాన్ని వమ్ముచేయకుండా బాగా చదవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, న్యాయాధికారి శివప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో శుక్రవారం డ్రగ్స్, అబ్యూజింగ్ చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ డ్రగ్ అబ్యూజింగ్ కింద నమోదయ్యే కేసులలో ఉన్న ఇబ్బందులు, అనంతరం తలెత్తే పరిణామాలను వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది హరికృష్ణ, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, కళాశాల ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, కళాశాల సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

30 మంది ఏఎస్ఐల బదిలీ

- 79మంది హెడ్‌కానిస్టేబుళ్లు కూడా..



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, డిసెంబరు 6: పట్టణాల్లో పనిచేసే పోలీసులను పల్లెలకు (మండల కేంద్రాల్లోని పోలీస్‌స్టేషన్లకు) మండలాల్లో పనిచేసే పోలీసులను పట్టణాలకు బదిలీ చేశారు. జిల్లాలో శుక్రవారం 30 మంది ఏఎస్ఐలు, 79 మంది హెడ్‌కానిస్టేబుళ్ల బదిలీలు జరిగాయి. జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ జగదీష్ పోలీసుల బదిలీలకు ఓపెన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒకే చోట ఐదేళ్లు పని చేసిన ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. వీరిని ప్రస్తుతం పనిచేస్తున్న నియోజకవర్గంలో కాకుండా మరో నియోజకవర్గానికి బదిలీ చేశారు. పిల్లల స్కూల్ విషయంలో ఇబ్బంది అవుతుందన్న నెపంతో కానిస్టేబుళ్ల బదిలీలు జరగలేదని సమాచారం. కౌన్సెలింగ్‌లో ఏఎస్పీ రమణమూర్తి, పోలీస్ అధికారుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

'నాయీబ్రాహ్మణులూ.. సభ్యత్వం తీసుకోండి'

అనంతపురం అర్బన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అర్బన్ పరిధిలోని నాయీ బ్రాహ్మణులు టీడీపీ సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కడియాల కొండన్న కోరారు. టీడీపీ అర్బన్ కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. నాయీబ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం కోసం పాటుపడే ఏకైక పార్టీ టీడీపీనేనన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఆధ్వ ర్యంలో నియోజకవర్గంలోని నాయీబ్రాహ్మణులు సభ్యత్వం చేయించు కోవాలని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ ఏర్పాటుచేసిన వీహెచ్‌పీఎస్ నిరంతర పోరాటాలు చేస్తోందని ఆ సంస్థ రాష్ట్ర అధికార ప్రతినిధి పెద్దన్న పేర్కొన్నారు. వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో గురువారం 65వ అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ పోస్టర్లను ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్దుర్తిక్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. కొత్తచెరువు మండలం లింగారెడ్డిపల్లికి చెందిన నరేంద్రకుమార్ ద్విచక్రవాహనంలో ధర్మవరం వైపు వెళ్తుండగా కారు ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. అతడిని స్థానికులు కొత్తచెరువు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

చో రామస్వామి (వర్ధంతి)



తమిళ సినీరంగంలో నటుడు, కమెడియన్, క్యారెక్టర్ ఆర్టిస్ట్, ప్లే రైట్, డైలాగ్ రైటర్‌గానే కాక రాజకీయ విమర్శకులు, న్యాయవాదిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. నాటకంలోని ఒక పాత్ర ద్వారా పేరొందిన శ్రీనివాస అయ్యర్ రామస్వామి 1934 అక్టోబరు 5న తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని మైలాపూర్ ప్రాంతంలో జన్మించారు. దెన్‌మొళియల్ నాటకాన్ని రాసి అందులో 'చో' పాత్రతో ప్రేక్షకులను రక్తి కట్టించడంతో 'చో రామస్వామి'గా పేరొందారు. నాలుగు దశాబ్దాలలో 180 సినిమాలలో నటించగా 5 సినిమాలకు దర్శకత్వం వహించారు. అప్పట్లో ప్రముఖ నటులందరితోనూ నటించారు. కాగా 20 నాటకాలను రచించి దర్శకత్వం వహించారు. 'తుగ్లక్' పత్రిక సంస్థాపకులు, ఎడిటర్. 1999లో రాజ్యసభకు నామినేట్ అయ్యారు. 2016 డిసెంబరు 7న కన్నుమూశారు. సాహిత్యం, విద్య, జర్నలిజంలలో సేవలకుగాను మరణానంతరం 'పద్మభూషణ్' ప్రకటించారు.

ఎల్ఆర్ ఈశ్వరి (పుట్టినరోజు)



ప్రముఖ నేపథ్యగాయని ఎల్ఆర్ ఈశ్వరి 1939 డిసెంబరు 7న చెన్నైలో జన్మించారు. గాయనిగా వేలాది పాటలు పాడారు. తమిళ, తెలుగు, మళయాళం, కన్నడ, హిందీ, తుళు, ఆంగ్లంతోపాటు మొత్తం 14భాషలలో సోలో, డ్యూయెట్ పాటలు ఆలపించారు. జానపదమైనా, భక్తి పాట అయినా అలవోకగా ఆలపించడం ప్రత్యేకం. ప్రత్యేకించి జానపదం, క్లబ్ డ్యాన్సుల పాటలతో పేరొందారు. కలైమామణి, తదితర పురస్కారాలు పొందారు.

సామూహిక వివాహాల్లో ఒక్కటైన 106 జంటలు

బాగేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని దేవర గుడిపల్లి (గడిదం)లోని లక్ష్మీవెంకటరమణస్వామి ఆలయంలో శుక్రవారం ఎస్ఎన్ సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటైన ఉచిత సామూహిక వివాహాల్లో 106 జంటలు ఏకమయ్యాయి. ఏటా ట్రస్టు ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నారు. 22వ వార్షిక సామూహిక వివాహాలకు ఆదిచుంచనగిరి చిక్కబళ్ళాపుర శాఖకు చెందిన మంగళానాథ స్వామిజీ సాన్నిధ్యం వహించి వధూవరులను ఆశీర్వదించారు. ఎమ్మెల్యే సుబ్బారెడ్డి మాట్లాడుతూ పేదలు వివాహాలకు చేయడానికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అందుకే ట్రస్టు ద్వారా సామూహిక వివాహాల ద్వారా చేయూత ఇస్తున్నామన్నారు. అధికారం ఉన్నా లేకున్నా ప్రజాసేవలో నిరంతరం కొనసాగుతున్నట్టు తెలిపారు. నూతన దాంపత్యజీవనంలోకి అడుగుపెట్టినవారు తమ తల్లిదండ్రులను చక్కగా చూసుకోవాలని హితవు పలికారు. కుటుంబ నిర్వహణకోసం ఇచ్చిన సీమ ఆవును విక్రయించరాదన్నారు. కల్యాణ వేదికను తిరుమల తిరుపతి తరహాలో రూపొందించారు. ఉచిత సామూహిక వివాహాల్లో నమోదు చేసుకున్న వారి గుర్తింపుకార్డుల వివరాలను తాలూకా స్త్రీ శిశుసంక్షేమ అధికారి రామచంద్రప్ప, అధికారి బసవ్వ, అన్సూబాయి, ఈరమ్మ, సుజాతలు పరిశీలించారు. సామూహిక వివాహాలతో గడిదం గ్రామంలో సందడి నెలకొంది. జిల్లా అధికారి పీఎన్ రవీంద్ర, జిల్లా పంచా యతీ సీఈఓ ప్రకాశ్ జె నిట్టాలి, ఇన్‌చార్జ్ జిల్లా అధికారి భాస్కర్, ఎస్పీ కుశాల్ చౌక్సి, డీఎస్పీ శివకుమార్, తహసీల్దార్లు మనీషా పత్రి, సిఖబతుల్లా, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ వర్ని, ఈఓ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



వధూవరులతో ఎమ్మెల్యే సుబ్బారెడ్డి దంపతులు



నూతన వధూవరులు

కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించండి

శిడ్లఘట్ట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామపంచాయతీలకు ఈనెల 8న జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలని కాంగ్రెస్ నాయకుడు పుట్టు ఆంజినప్ప కోరారు. తాలూకాలోని జంగమకోటె హోబళి మళమాచనహళ్ళి, భక్తరహళ్ళి, నాగమంగల, హొసపేట గ్రామపంచాయతీలకు ఈనెల 8న ఎన్నికలు జరుగుతున్నాయి. మాజీ మంత్రి వీ మునియప్ప, ఆయన కుమారుడు శశిధర్, ఇతర నాయకులతో కలసి శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి దృష్ట్యా కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడంతో స్థానిక సంస్థలకు మరింత అనుకూలం కానుందన్నారు. సమావేశంలో కర్ణాటక పాల సమాఖ్య డైరెక్టర్ శ్రీనివాస్ రామయ్య, కోచిముల్ మాజీ అధ్యక్షుడు కే గుడియప్ప, యువ నాయకుడు హిరేబల్ల రాజీవ్‌కుమార్, జంగమకోటె రైతు ఉత్పత్తుల కంపెనీ అధ్యక్షుడు భక్తరహళ్ళి చిదానందమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మద్దతుదారులతో కాంగ్రెస్ నాయకుడు పుట్టు అంజినప్ప తదితరులు

వాతావరణ మార్పులతోనే మిరపకు తెగుళ్లు



మిరప పంటను పరిశీలిస్తున్న పరిశోధకులు

కంప్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వాతావరణ మార్పులతోనే మిరపకు తెగుళ్ల వ్యాపిస్తున్నట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు తెలిపారు. కంప్లి తాలుకా పరిధిలోని శ్రీరామరంగాపురం, గోనాళ్, మారుతీ క్యాంపు, దేవసముద్రం, మెట్రి, తదితర గ్రామాల్లో శుక్రవారం మిరప పంటను డాక్టర్ రాఘవేంద్ర ఆచారి, డాక్టర్ రఘునాథ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటలకు ఈ సారి త్రిప్స్ తెగుళ్ల సోకి రైతులు పూర్తిగా పంటలు నష్టపోయారన్నారు. వేప పిండి, పురుగుల మందు 50 కిలోల చొప్పున మట్టిలో వేసుకున్నట్లయితే కొంత వరకు రోగనిరోధక శక్తి ఏర్పడేదన్నారు. అలాగే కీటనాశిని మూడు మిల్లీమీటర్లు ఇమడాక్లోరోఫైడ్, తయోమెథక్సాస్ 25 గ్రామ్స్, విప్రోనిల్, డయాఫిన్‌థయోరిన్ మందులు పిచికారి చేసినట్లయితే ఈ త్రిప్స్ తెగుళ్ల కొద్ది వరకు నిరోధించవచ్చన్నారు. తడి కూడా ఎక్కువగా వుండటంతో మొక్కలు ఒకదానికొకటి తోడుగా వుండటంతో ఈ తెగుళ్ల ఎక్కువగా సోకేవన్నారు. దీనికి ముందు మట్టి పరీక్షలు చేపట్టి దానికి తగిన ఎరువులు వాడినట్లయితే నివారణ వుండేదన్నారు.వారితో పాటు అరుణ్‌కుమార్, తోట గారి శాఖ అధికారి కరేగౌడ వున్నారు.

ప్రత్యేక రుణ మేళా

వాషర్‌మెన్‌పేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తుపానుతో నష్టపోయిన చిరువ్యాపారులకు సహకార బ్యాంక్‌ల ద్వారా ఈ నెల 12వ తేది వరకు ప్రత్యేక రుణ మేళా నిర్వహిస్తున్నట్లు సహకార శాఖ మంత్రి పెరియకరుప్పన్ తెలిపారు. ఆ ప్రకారం, వరద బాధిత జిల్లాలైన విల్లుపురం, కళ్లకుర్చి, తిరువణ్ణామలై, కడలూరు, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాలకు చెందిన చిరు వ్యాపారులకు ప్రత్యేక సూక్ష్మ రుణాలు అందజేయనున్నారు. ఈ శిబిరాల్లో రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు రుణం అందించనున్నారు. ఫుట్‌పాత్ వ్యాపారులు, చిరు వ్యాపారులు, పూలు, పండ్ల వ్యాపారులు, మత్స్యకారులు, ఆటో డ్రైవర్లు ఈ రుణ మేళాలో పాల్గొని లబ్ది పొందవచ్చని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

రైలు ఢీకొని మహిళా ఎస్ఐ మృతి

అడయార్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లా కందికుప్పం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ (స్పెషల్)గా పనిచేసే మేరీస్ స్టెల్లా (50) రైలు ఢీకొని దుర్మరణం పాలయ్యారు. శుక్రవారం ఉదయం కోర్టు విధుల కోసం మద్రాస్ హైకోర్టుకు వచ్చేందుకు కందికుప్పం నుంచి తిరుపత్తూరు జిల్లా వాణియంబాడికి బస్సులో వచ్చారు. అక్కడ నుంచి చెన్నై చేరుకునేందుకు ఏలగిరి ఎక్స్‌ప్రెస్ ఎక్కాలని భావించి, పట్టాలు దాటుతున్నారు. ఆ సమయంలో ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే చనిపోయారు. సమాచారం అందుకున్న జోలార్‌పేట రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్టెల్లాకు భర్త, ఇద్దరు పిల్లలున్నారు.

నేడు కేంద్ర బృందం పర్యటన

చెన్నై, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఫెంగల్ తుఫాన్ కారణంగా ఆస్తి, పంట, ప్రాణ నష్టం జరిగిన విల్లుపురం, కడలూరు తదితర జిల్లాల్లో శనివారం కేంద్ర బృందం పర్యటించనుంది. తుపాను బాధితులను ఆదుకునేందుకు రూ.2 వేల కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఇదివరకే కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ పరిస్థితుల్లో కేంద్ర హోం శాఖ డిప్యూటీ కార్యదర్శి రాజేష్‌గుప్తా నేతృత్వంలోని కేంద్ర పరిశీలన కమిటీ బృందం శుక్రవారం సాయంత్రం నగరానికి విచ్చేశారు. ఈ కమిటీలో పొన్నుసామి, సోనమణి హేబం, శరవణన్, ధనపాలన్ కుమరన్, రాహుల్ పచ్చోడి, బాలాజీ సహా ఎనిమిదిమంది ఉన్నారు. ఈ ఎనిమిదిమంది తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో శనివారం నుండి పర్యటించనున్నారు.

వివిధ రంగాల్లో విజేతలకు సన్మానం

అంబేడ్కర్‌కు ఘన నివాళి

దొమ్మసంద్ర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆనేకల్ తాలూకా సర్జాపుర గ్రామంలో శుక్రవారం వివిధ రంగాల సాధకులను సత్కరించారు. ఇదే సందర్భంగా రాజ్యాంగ పీఠికను చదివే పోటీలు నిర్వహించి విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందచేసి అభినందించారు. సర్జాపుర గ్రామపంచాయతీ సభ్యుడు డాక్టర్ మంజు సర్జా, ట్రస్టు పదాధికారులు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, హైస్కూల్ విద్యార్థులకోసం బ్యాండ్‌సెట్‌ను బహూకరించారు. క్రీడామైదానం ముందు ప్రజలకోసం మార్గసూచి నామఫలకాన్ని ప్రారంభించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సేవా ట్రస్టు సంస్థాపక అధ్యక్షుడు జీ మునియప్ప, ప్రధాన కార్యదర్శి మూర్తి కుమార్, జడ్పీ మాజీ సభ్యురాలు సుజాత నాగరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాగేపల్లిలో..

బాగేపల్లి: తాలూకా కేంద్రమైన బాగేపల్లిలో దళిత హక్కుల సమితి చిక్కబళ్ళాపుర జిల్లా సమితి నేతృత్వంలో అంబేడ్కర్ 68వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. సమితి సభ్యులు, స్థానికులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

బంగారపేటలో...

బంగారపేట: భారతరత్న అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యున్నతమైనదిగా ఉందని ఎమ్మెల్యే ఎస్ఎన్ నారాయణస్వామి అభిప్రాయపడ్డారు. బంగారపేట పట్టణంలో తాలూకా యంత్రాంగం, సాంఘిక సంక్షేమశాఖ సంయుక్తంగా శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. అంబేడ్కర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి, కొవ్వొతి వెలిగించి నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతికి అంబేడ్కర్ పాటుపడ్డారన్నారు. సమాజంలో వెనుకబడినవర్గాల సంక్షేమంకోసం తగిన ప్రాధాన్యత ఇవ్వడంతో కొంతమెరుగు సాధ్యమైందన్నారు. బీఈఓ గురుమూర్తి, పురసభ అధ్యక్షుడు గోవింద, ఉపాధ్యక్షురాలు చంద్రవేణి మంజునాథ్, సభ్యులు వెంకటేశ్, రత్నమ్మ, పొన్ని, తహసీల్దారు వెంకటేశ్, ఈఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్ఎస్ ఆధ్వర్యంలో...

దళిత సంఘర్ష సమితి (డీఎస్ఎస్) ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పించారు. డీఎస్ఎస్ రాష్ట్ర సంచాలకులు సూలికుంటె రమేశ్ మాట్లాడుతూ అంబేడ్కర్ దూరమైనా ఆయన రచించిన రాజ్యాంగం రూపంలో మనకు దగ్గరంగా ఉన్నారన్నారు. ఇదే సందర్భంగా రాజ్యాంగంపై ఆసక్తి పెంచేలా రాజ్యాంగ పీఠికను చదవడం, పోటీలు నిర్వహించడం వంటి అవగాహన కార్యక్రమాలు ఇటీవల పెరిగాయన్నారు. అయినా కూడా సమాజంలో వెనుకబడినవర్గాలపై తరచూ దాడులు కొనసాగుతూనే ఉన్నాయని విచారం వ్యక్తం చేశారు. సమాజంలో మరింత మార్పు అవసరమన్నారు. కార్యక్రమంలో తాలూకా సంచాలకులు దేశిహళ్ళి శ్రీనివాస్, శివకుమార్, మహబూబ్, జయప్రకాశ్, ఎస్‌డీఎంసీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. మరో కార్యక్రమంలో కర్ణాటక రిపబ్లిక్ సంఘం ఆధ్వర్యంలోనూ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ ఆశయాలను అర్థం చేసుకోవాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిక్కనారాయణ అభిప్రాయపడ్డారు. పలువురు కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



బాగేపల్లిలో అంబేడ్కర్‌కు నివాళులు



బంగారపేటలో అంబేడ్కర్‌కు నివాళిలో ఎమ్మెల్యే నారాయణస్వామి తదితరులు



సర్జాపురలో రాజ్యాంగ పీఠిక పోటీల విజేతలకు సన్మానం

ఘనంగా నగర సంకీర్తన

పుట్టపర్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా భక్తులు శుక్రవారం రాత్రి పట్టణ వీధుల్లో సత్యసాయి నగర సంకీర్తన ఘనంగా నిర్వహించారు. పర్తియాత్ర పేరుతో 3వేల మంది భక్తులు ప్రశాంతి నిలయం చేరుకున్నారు. రాత్రి సత్యమ్మగుడి వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తిపాటలు పాడుతూ రథాన్ని లాగారు. మహిళా భక్తులు బోనాలతో నగర సంకీర్తనలో పాల్గొన్నారు. సత్యమ్మ గుడి వద్ద నుంచి ప్రశాంతినిలయం గణేశ్ గేటు వరకు కనులపండువగా నగర సంకీర్తనసాగింది. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



బోనాలతో నగర సంకీర్తనలో పాల్గొన్న మహిళాభక్తులు



సత్యసాయి రథాన్ని లాగుతున్న భక్తులు

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి : మంత్రి

సోమందేపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భూసమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీసీ సంక్షేమ, చేనేతజౌళి శాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. మండలంలోని నాగినాయనిచెరువు గ్రామంలో గల స్వయం సహాయక సంఘాల భవనం ఆవరణలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి మంత్రి అర్జీలు స్వీకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. భూ వివాదాలు, కొలతల్లో తేడాలు, సర్వే నంబర్లలో మార్పులు, వారసత్వపు పేర్ల నమోదు రికార్డులో మార్పు, రీసర్వే ద్వారా హద్దులు ఏర్పాటు చేయడం తదితర సమస్యలను 45 రోజుల్లోపే పరిష్కరిస్తామన్నారు. వ్యవసాయశాఖ అధికారులు గ్రామసభకు హాజరు కావడంలేదని రైతులు.. మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నల్లగొండ్రాయనపల్లి వద్ద రోడ్డుపై వరిధాన్యాన్ని ఆరబోసుకుంటున్న రైతులతో మంత్రి మాట్లాడారు.

వైభవంగా జడేసిద్దేశ్వర రథోత్సవం

కంప్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాలుకా పరిధిలోని ఎమ్మిగనూరు గ్రామంలో ప్రసిద్ధిగాంచిన జడే సిద్దేశ్వర శివయోగి స్వామి రథోత్సవం శుక్రవారం కనుల పండువగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో ముత్తయిదువ మహిళలు పూలు, పండ్లతో మొక్కులు సమర్పించుకున్నారు. సాయంత్రం ఆలయం నుంచి బసవన్న కట్ట వరకు ఎమ్మిగనూరు గ్రామంలో ఊరేగించారు. ఎమ్మిగనూరుతో పాటు కంప్లి నియోజకవర్గంలోని గ్రామాలతో పాటు పట్టణాలు కంప్లి, గంగావతి, హోస్పేట, బళ్లారి, సిరుగుప్ప, గంగావతి, పట్టణాలను కూడా పొరుగు రాష్ట్రాలు, ఆంధ్ర, తెలంగాణ నుంచి వేలాది మంది భక్తాదులు తరలివచ్చి స్వామి వారికి మొక్కులు సమర్పించుకున్నారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు



ఆదర్శప్రాయుడు అంబేడ్కర్ : సీఎం

బెంగళూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగనిర్మాత, భారతరత్న డాక్టర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయులని సీఎం సిద్ధరామయ్య అభిప్రాయపడ్డారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని విధానసౌధలో శుక్రవారం అంబేడ్కర్ చిత్రపటానికి, విగ్రహానికి సీఎం పుష్పాంజలి ఘటించారు. సమాజంలో అందరూ సమానంగా ఉండాలని ఆకాంక్షించిన వారిలో బసవణ్ణ, బుద్ధుడి తర్వాత అంబేడ్కర్ అని సీఎం కొనియాడారు. ప్రపంచంలోని ఎన్నో దేశాలకు మన రాజ్యాంగం ఆదర్శప్రాయంగా ఉందన్నారు. కార్యక్రమంలో మంత్రి మహదేవప్ప, జార్జ్‌తోపాటు పలువురు పాల్గొన్నారు. కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ కార్యాలయాలలో అంబేడ్కర్ చిత్రపటాలకు పూలు చల్లి నివాళులు అర్పించారు. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలతోపాటు విద్యాసంస్థలలో అంబేడ్కర్ వర్ధంతి జరిపారు. బీబీఎంపీలో చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ ఆధ్వర్యంలో వర్ధంతి జరిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతిచోటా అంబేడ్కర్ సేవలను ఆశయాలను కొనియాడారు.

విద్యార్థులను అంతర్జాతీయస్థాయిలో పోటీ పడేలా తీర్చిదిద్దండి

బెంగళూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక విద్యార్థులకు అంతర్జాతీయస్థాయిలో ఉద్యోగాలకు పోటీ పడేలా తీర్చాలని ఐటీబీటీశాఖల మంత్రి ప్రియాంక ఖర్గే పిలుపునిచ్చారు. రామయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ కాన్ఫెరెన్స్ ఎమర్జింగ్ టెక్నాలజీస్ బిజినెస్ అండ్ సొసైటీ (ఐసీఈటీబీఎస్) ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇంక్యుబేటర్స్ ద్వారా నైపుణ్యత పెంచాలన్నారు. నిపుణ కర్ణాటక దేశంలోనే అతిపెద్ద కౌశల్యాభివృద్ధి ప్రాజెక్టు కానుందన్నారు. ప్రభుత్వం, విద్యాసంస్థల పరిశ్రమలకు అవసరమైన మానవవనరులను తీర్చేలా వ్యవహరించాలన్నారు. రామయ్య ఇన్‌స్టిట్యూట్ మేనేజిమెంట్ డైరెక్టర్ డాక్టర్ మానస నాగభూషణం, జాగ్వార్ లాండ్‌రోవర్ టెక్నాలజీ బిజినెస్ సర్వీస్ ఇండియా సీఈఓ లలితా ఇంద్రకాంతి, అమడా వెల్డ్‌టెక్ ఇండియా ఎండీ సుటోము కొయిడులు పాల్గొన్నారు. వైస్‌వర్క్ కోఫౌండర్ సీఈఓ డాక్టర్ శ్రీనివాసన్, ప్రొఫెసర్ డాక్టర్ వీ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

మరో పాతికేళ్లలో ఐదుగురిలో ఒకరు వృద్ధులు

బెంగళూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): దేశంలో వృద్ధులసంఖ్య పెరుగుతోందని 2050 నాటికి ప్రతి ఐదుగురిలో ఒకరు సీనియర్ సిటిజన్ ఉంటారని ఏఎస్ఎల్ఐ ఏజింగ్ ఫెస్ట్‌లో పలువురు అభిప్రాయపడ్డారు. శుక్రవారం నగరంలో అసోసియేషన్ ఆఫ్ సీనియర్ లివింగ్ ఇండియా ఐదో విడత సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నీతి ఆయోగ్ ప్రతినిధి డాక్టర్ వీకే పాల్ మాట్లాడుతూ సీనియర్లకు అవసరమైన వస్తువుల మార్కెటింగ్ కూడా పెరుగుతోందన్నారు. ఏఎస్ఎల్ఐ చైర్మన్ సీనియర్ కేర్ ఎండీ సీఈఓ రజత్ మెహతా మాట్లాడుతూ ప్రపంచస్థాయి తరహాలో సీనియర్ల జీవన సమస్యల పరిష్కారానికి ప్రైవేట్ సంస్థలు కీలకంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఆధునీకరణ, రిటైర్మెంట్ తర్వాత ఆర్థికతతోపాటు వారికి ప్రత్యేకమైన సౌలభ్యాలు కల్పించాలన్నారు. దేశంలో సీనియర్ సిటిజన్‌లకు అవసరమైన సౌలభ్యాలు కల్పించాలన్నారు. దీర్ఘకాలం జీవనం కంటే ఉన్నంతకాలం ఆరోగ్యంగా, సంతోషంగా ఉండేలా సహకరించాలన్నారు. సంస్థ కో ఫౌండర్ జాయింట్ డైరెక్టర్ అంకుర్ గుప్త మాట్లాడుతూ దేశంలో వృద్ధులసంఖ్యలో మార్పు వస్తోందన్నారు. సీనియర్లకు అవసరమైన సౌలభ్యాల గురించి పలు తీర్మానాలు చేశారు.




ఏఎస్ఎల్ఐ సదస్సులో డాక్టర్ వీకేపాల్ తదితరులు

రైలు ప్రమాదంలో శ్రీకాకుళంవాసి దుర్మరణం

దొడ్డబళ్ళాపుర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అల్లు అర్జున్ నటించిన పుష్ప-2 సినిమా చూసేందుకు వెళ్ళే ఆత్రుతలో ఒక యువకుడు రైలుకింద పడి దుర్మరణం చెందిన సంఘటన దొడ్డబళ్ళాపుర తాలూకాలో చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రవీణ్ (19) మృతి చెందిన యువకుడు ఇతడు బాశెట్టిహళ్ళిలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. ఐటిఐ పూర్తి చేసి రెండు నెలలక్రితం బాశెట్టిహళ్ళి పారిశ్రామికవాడలోని ఓ సంస్థలో చేరాడు. గురువారం పుష్ప-2 సినిమా చూసేందుకు ఉదయం మిత్రులతో కలసి టాకీస్‌వైపు బయల్దేరారు. బాశెట్టిహళ్ళి వద్ద రైల్వే క్రాసింగ్ దాటుతుండగా ఒకవైపు నుంచి గూడ్స్, మరోవైపునుంచి గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చాయి. గూడ్స్, రైలు మధ్య యువకుడు చిక్కుకుని మృతి చెందాడు. దొడ్డబళ్ళాపుర ఔట్‌పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. యశ్వంతపుర రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా రాజేశ్వరి

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా రాజేశ్వరి ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో శుక్రవారం ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షురాలిగా బత్తలపల్లికి చెందిన రాజేశ్వరి, ఉపాధ్యక్షురాలిగా లక్ష్మీదేవి (చిలమత్తూరు), కార్యదర్శిగా సీతారామలక్ష్మి (తాడిమర్రి), ఉప కార్యదర్శిగా సుకన్య (రామగిరి), కోశాధికారిగా వనజ (నల్లమాడ) ఎన్నికయ్యారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1629.61	1,592.49
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	3,246	853
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	5,224	1,958
నీటి నిల్వ (టీఎంసీలు)	92.61	13.24

బాలింతల మృతిపై సీబీఐ విచారణ జరిపించాలి

● మాజీ మంత్రి శ్రీరాములు డిమాండ్

బళ్లారి సిటీ,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బాలింతల వరుస మరణాలపై సీబీఐచే విచారణ జరిపించాలని మాజీ మంత్రి శ్రీరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన జిల్లా ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఏడాది వంద మందికి పైగా బాలింతలు చనిపోయారన్నారు. గత నవంబరు 9నుంచి 11వరకు ఐదుగురు బళ్లారిలోనే మృతి చెందారన్నారు. గత మార్చి నుంచి తుమకూరు, దావణగెరె, సింధనూర్ తదితర ప్రాంతాల్లో పలువురు బాలింతలు మృతి చెందారన్నారు. ఇంతవరకు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దినేష్‌గుండురావు కనీసం వచ్చి పరిశీలించలేదని, బెంగళూరులో కూర్చుని ప్రపంచాన్ని చూస్తున్నారని మండిపడ్డారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. తప్పు ఎవరిది అని ముఖ్యమంత్రి సిద్దరామయ్య చెప్పాలన్నారు. బాలింత మృతికి ఫ్లూయిడ్స్ కారణమని పరిశోధకులు నివేదిక ఇచ్చినా, గ్లూకోజ్ కంపెనీపై చర్యలు ఎందుకు తీసుకోలేదన్నారు. నిషేధిత కంపెనీ ఎందుకు గ్లూకోజ్ సరఫరా చేస్తోంది ? దీని వెనుక ఎవరున్నారని ప్రశ్నించారు. తల్లిబిడ్డల భద్రత విషయంలో రెండోస్థానంలో ఉన్న కర్ణాటక రాష్ట్రం ఇప్పుడు చివరి స్థానానికి వచ్చిందన్నారు. బాలింతల మృతిపై ఇప్పటికైనా ప్రభుత్వం కన్ను తెరవాలన్నారు.



ఆస్పత్రిలో బాలింతను పరామర్శిస్తున్న శ్రీరాములు

సమస్యలు పరిష్కరించాలి: ఏఐఎంఎస్‌ఎస్

బళ్లారి సిటీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పెరుగుతున్న బాలింతలు, నవజాత శిశువుల మరణాలను అరికట్టడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించాలని అఖిలభారత మహిళా సాంస్కృతిక సంఘం జిల్లా యంత్రాంగం గురువారం జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం జిల్లాధ్యక్షులు ఈశ్వరీ మాట్లాడుతూ మహిళలందరికీ విద్య, ఆరోగ్యం అందేలా చూడాలని, అన్ని తాలూకా కేంద్రాల్లో ప్రభుత్వ మహిళాడిగ్రీ కళాశాలలను ప్రారంభించాలన్నారు. మహిళల భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రేపిస్టులను కఠినంగా శిక్షించాలని, ఆరోగ్య ప్రైవేటీ కరణను ఆపాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్త్రీలు, పిల్లలకు నాణ్యత కలిగిన వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. బళ్లారి ప్రాంతంలో పెరుగుతున్న బాల్యవివాహాల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. డిమాండ్లను నెరవేర్చాలని జిల్లా యంత్రాంగం ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆ జిల్లాధ్యక్షులు ఈశ్వరీ, జిల్లాకమిటీ పదాధికారులు విద్య, జె.సౌమ్య



వినతి పత్రం అందజేస్తున్న ఏఐఎంఎస్‌ఎస్ సభ్యులు

ఇన్వర్టర్ పేలి ఇల్లు దగ్ధం

బళ్లారి సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని హలకుంది గ్రామంలో ఓ ఇంట్లో ఇన్వర్టర్ పేలి ఇంట్లోని సామాగ్రి దగ్ధమైన ఘటన చేసుచేసుకుంది. శుక్రవారం ఉదయం 11గంటల ప్రాంతంలో ఇంట్లోని మహిళ పుష్పవతి జీన్స్ పరిశ్రమలో పనికి వెళ్ళింది. ఆమె కుమారుడు కాలేజీకి వెళ్ళిన సమయంలో ఈ ఘటన జరిగింది. విషయం తెలుసుకున్న అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేయడంతో ఇరుగుపొరుగు ఇళ్లకు మంటలు వ్యాపించలేదు. ఇంట్లోని నగలు, డబ్బు, ధాన్యం, ఇతర వస్తువులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గ్యాస్ సిలిండర్ పేలకపోవడంతో మంటలు వ్యాపించలేదు. ఈమేరకు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మతతత్వ రాజకీయాలను మట్టు పెట్టాలి: ఎస్‌యూసీఐ



నిరసన తెలుపుతున్న ఎస్‌యూసీఐ సభ్యులు

బళ్లారి సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్, భారతదేశంలో పెరుగుతున్న మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా శుక్రవారం ఎస్‌యూసీఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఎస్‌యూసీఐ జిల్లా కమిటీ సభ్యులు దేవదాస్ మాట్లాడుతూ ఇటీవల షేక్ హసీనాను గద్దెదించిన చారిత్రక విద్యార్థి తిరుగుబాటులో ముస్లింలు, హిందువులు పరస్పరం పోట్లాడుకున్నారు. ఇప్పుడు హిందువులపై దాడులు జరుగుతున్నాయన్నారు. మైనారిటీ హిందువులను మతతత్వ శక్తులు దుర్వినియోగం చేస్తున్నాయన్నారు. భారతదేశంలో కూడా మైనార్టీలపై పదేపదే దాడులు జరుగుతున్నాయన్నారు. బంగ్లాదేశ్, భారతదేశం రెండింటి పాలకులకు కూడా ప్రజలను విభజించి పాలించడానికి మతతత్వం , జాతివాదం వ్యాప్తి చేస్తున్నారన్నారు. అధ్యక్షత వహించిన జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ ప్రమోద్ మాట్లాడుతూ రెండు దేశాల్లో ధరల పెరుగుదల, నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం తదితర సమస్యలతో సామాన్యులు అల్లాడిపోతున్నారన్నారు. దీనికి కారణం పెట్టుబడిదారీ వ్యవస్థేనని అన్నారు. పార్టీలు అన్ని మతాల ప్రజల మధ్య మతపరమైన విషాన్ని వ్యాపింపజేస్తున్నాయని, అసలైన సమస్యలపై ఐక్యంగా పోరాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నిరసనలో ఎస్‌యూసీఐ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సోమశేఖర్‌గౌడ, ఏ.శాంత, గోవింద్, హనుమంతప్ప, సురేశ్, జగదీశ్, ఈశ్వరీ, రవికిరణ్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు అమలు చేయాలి: మాదిగ దండోరా



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ దండోరా నాయకులు

బళ్లారి సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంతర్గత రిజర్వేషన్లను వెంటనే అమలు చేయాలని మాదిగ దండోరా రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జి.నరసప్ప డిమాండ్ చేశారు. గురువారం నగరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగ దండోరా జాతీయ నాయకుడు మందకృష్ణమాదిగా 30ఏళ్ల నిరంతర పోరాటం ఫలితంగా సాధించిన అంతర్గత రిజర్వేషన్లను అమలు చేయాలన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చి రెండు నెలలు గడిచినా సిద్దరామయ్య ప్రభుత్వం అమలు చేయడంలో ఆసక్తి చూపడం లేదన్నారు. ఇకపైనైనా రిజర్వేషన్లు అమలు చేయకపోతే వరుణ నియోజకవర్గం నుంచి పాదయాత్ర ద్వారా విధానసౌద ముట్టడి చేస్తామన్నారు. ముఖ్యమంత్రి మారితే మాదిగ సమాజికవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు మునియప్పకు ముఖ్యమంత్రి పదవి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా మాదిగ దండోరా రాష్ట్ర అధికార ప్రతినిధి కత్తి వెంకటేశ్, యువకార్యదర్శి ప్రసాద్, వీరస్వామి, జిల్లాధ్యక్షుడు నెట్టప్ప,ఉపాధ్యక్షుడు ఎం.బసవరాజు, కోశాధికారి సన్న హొన్నూరప్ప, ప్రధాన కార్యదర్శి రాజా, దుర్గేశ్, విజయకుమార్, సండూర్ అంజినప్ప, సుంకప్ప ఎర్రగుడి, కురుగోడు తాలూకా అధ్యక్షుడు ఈరన్న, సతీశ్ హెగ్డే, సిరుగుప్ప తాలూకా అధ్యక్షుడు వీరేశ్, కంప్లితాలూకా అధ్యక్షుడు యన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

తాయమ్మదేవికి ప్రత్యేక పూజలు

సిరుగుప్ప, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : తాయమ్మ దేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిరుగుప్ప పట్టణంలోని ఆదోని రోడ్డు మార్గంలో వెలసిన తాయమ్మదేవికి భక్తులు పుష్పాలంకార సేవలు, కుంకుమాభిషేకం, ఆకులపూజ, బిల్వార్చన, ప్రదక్షిణ కార్యక్రమాలను చేపట్టారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద పంపిణీ చేశారు. ప్రధాన అర్చకులు శ్రీనివాస, ప్రవీణ్‌లు అమ్మవారికి మహామంగళహారతి పూజలు చేశారు.



అలంకరణలో అమ్మవారు

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న అధికారులు

బళ్లారి సిటీ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా జిల్లా పాలనా యంత్రాంగం, జిల్లాపంచాయతీ ,సాంఘిక సంక్షేమ శాఖ తరపున గురువారం ఘనంగా నివాళి అర్పించారు. జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప మోతీ రహదారిలోని అంబేడ్కర్ భవనంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం మానవాళి జీవనానికి దోహదపడుతుందన్నారు. అలాంటి మహనీయుని అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈసందర్భంగా డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేర్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు మల్లికార్జున, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, వివిధ సంఘాల దళిత సంఘాల నాయకులు, కార్యాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

15న అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

కంప్లి, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి) : తాలుకా సమీపంలోని సన్నాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని బసవేశ్వర స్వామి క్యాంపులో నూతనంగా ఏర్పాటు చేసిన అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ఈ నెల 15న ప్రతిష్ఠించనున్నట్లు క్యాంపు వాసులు వెంకటరామరాజు తెలిపారు. శివరామకృష్ణశర్మ నేతృత్వంలో 13, 14, 15వ తేదీల్లో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 13న గణపతి పూజ, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠాపన, గణపతి హోమం, వాస్తు హోమం, తదితర పూజలు జరుగుతాయి. 14న నవగ్రహ హోమం, మహాభిషేకం, అవర్ణ దేవత హోమాలు, విగ్రహాల ఊరేగింపు వుంటాయన్నారు. 15న ఉదయం 5.35 నుండి 8.14 గంటలలోపు వివిధ పూజలు చేపట్టి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతోందని తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



ప్రతిష్ఠకు సిద్ధంగా ఉన్న స్వామి విగ్రహం

9న చలో బెళగావి

రాయచూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 9వ తేదీన చలో బెళగావి ఆందోళన చేపట్టనున్నట్లు కర్ణాటక రైతు సంఘం, హసిరు సేనల జిల్లా అధ్యక్షుడు నరసింహలు నాయక్ తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి బెళగావిలో శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ ఆందోళన చేపట్టనున్నట్లు వారు తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ రైతుల పాలిట శాపంగా ఉన్న మూడు కొత్త వ్యవసాయ చట్టాల అమలును నిలిపివేయడం, రైతులకు పూర్తిస్థాయిలో రుణమాఫీ అమలు చేయడం పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను కల్పించడం వంటివి తమ ప్రధాన డిమాండ్లుగా వివరించారు. కాగా జిల్లాలోని చెరువులన్నింటినీ కృష్ణ-తుంగభద్ర నది నీటితో నింపాలని, రైతులకు విద్యుత్ సరఫరా విషయంలో అన్ని రకాల పరికరాలను ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు. అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వ వైఖరిలో మార్పు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతు సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలను ప్రారంభిస్తామన్నారు. రైతు సంఘం చేపట్టిన ఆందోళనలో రైతులందరూ పెద్ద సంఖ్యలో భాగస్వాములు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

హిందువులపై దాడులను అరికట్టాలి

తోరణగల్లు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న హింసాకాండను నిరసిస్తూ శుక్రవారం బృహత్ ప్రతిఘటన ర్యాలీ చేపట్టారు. తోరణగల్లు స్టేషన్ జిందాల్ ఓల్డ్ గేటు నుండి దేశభక్త నాగరిక వేదిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో జరుగుతున్న హిందు హింసాకాండపై ప్రధాని మోదీ స్పందించి అడ్డుకోవాలన్నారు. దేశంలోనూ హిందువులపై దాడులు పెరిగిపోయాయన్నారు. ర్యాలీలో పలు హిందూ సంఘాలు పాల్గొన్నాయి.

వేళకు రాని బస్సులు .. విద్యార్థుల ఆందోళన



బస్సులను ఆపి ఆందోళన చేపట్టిన విద్యార్థులు

బళ్లారిరూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సులు వేళకు రాకపోవడంపై విద్యార్థులు ఆందోళన చేప్టారు. బళ్లారిరూరల్ పరిధిలోని బేవనహళ్లి గ్రామంలో శుక్రవారం సరైన కళాశాల సమయానికి బస్సులు రానందువల్ల గ్రామంలో విద్యార్థులు బస్సులను అడ్డగించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ నిత్యం కళాశాలకు వెళ్లాలంటే సరైన సమయానికి బస్సులు లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేసినా స్పందించలేదని వాపోయారు. పోలీసులు అక్కడికి చేరుకుని విద్యార్థులకు నచ్చజెప్పి సరైన సమయానికి బస్సులు తిరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

హాస్టల్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి: ఎమ్మెల్యే



బీసీ సంక్షేమ హాస్టల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎం నాగరాజు

సిరుగుప్ప, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన వర్గాల విద్యార్థులు హాస్టల్ సౌలభ్యాన్ని వినియోగించుకోవాలని ఎమ్మెల్యే బీఎం నాగరాజు తెలిపారు. శుక్రవారం సిరుగుప్ప పట్టణంలో బీసీ సంక్షేమ శాఖకు సంబంధించి పీయుసీ విద్యార్థుల కోసం నూతన హాస్టల్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో హాస్టల్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వెనుకబడిన వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ గాదెలింగప్ప, తాలుకా సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ తిప్పయ్య, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హోసూరు జోన్

దుకాణాలపై కార్పొరేషన్ అధికారుల ఆకస్మిక దాడులు

హోసూరు డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోసూరు కామరాజ కాలనీలో కార్పొరేషన్ అధికారులు శుక్రవారం అకస్మిక తనిఖీలు నిర్వహించారు. కూరగాయలు, ఉల్లి, వెల్లుల్లి సహా హోల్ సేల్, రిటైల్ విక్రయించే దుకాణాన్ని తనిఖీ చేశారు. ప్లాస్టిక్ కవర్లు భారీగా నిల్వ ఉంచడం, కుళ్లిన కూరగాయలు ఉన్నట్టు గుర్తించారు. దీంతో షాప్‌కు సీల్ వేశారు. దుకాణ యజమాని ఆనంద బాబు మీడియాతో మాట్లాడుతూ అధికారులు ఎలాంటి గడువు ఇవ్వకుండా ఏకంగా సీల్ వేశారంటూ వాపోయారు. అధికారులు స్పందిస్తూ ట్రేడ్ లైసెన్స్ లేకుండా దుకాణం నిర్వహించడమే కాక నిషేధించిన ప్లాస్టక్ కవర్లలో కూరగాయలు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ సీల్ వేసినట్టు అధికారులు ప్రకటించారు.

పాఠశాలకు డెస్కులు, కుర్చీల అందజేత

హోసూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్ 28వ వార్డు పరిధిలోని సానచంద్రం వీసీలో పనిచేస్తున్న ప్రైవేట్ బ్యాంకు సీఎస్ఆర్ ఫండ్ క్రింద ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం డెస్కులు, బెంచీలు సమకూర్చారు. శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో హోసూరు నగర కార్పొరేషన్ మేయర్ సత్య సమక్షంలో పాఠశాలకు అందచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆనందయ్య, బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ మీరాబాబు, కౌన్సిలర్లు దేవి మాదేశ్, శశిదేవ్, ప్రభాకరన్, ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్, శంకర్, డివిజన్ కార్యదర్శి రాము, సర్కిల్ సెక్రటరీలు రాజేంద్రన్, జాన్ మంజునాథ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు, సిబ్బందితో మేయర్ సత్య, బ్యాంకు ఉద్యోగులు

రేపు గురజాడ సాహిత్య పుస్తకావిష్కరణ

హోసూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆంధ్ర సాంస్కృతిక భవనంలో ఈనెల 8న ఆదివారం గురజాడ అప్పారావు సాహిత్య పుస్తక ఆవిష్కరణ జరగనుంది. మధ్యాహ్నం 2.30 గంటలకు ఏర్పాటయ్యే కార్యక్రమంలో తెలుగు సాహితి అభిలాషలు హాజరు కానున్నారు. కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘ అధ్యక్షులు అగరం వసంతు నేతృత్వం వహించనున్నారు. ఆయన మాట్లాడుతూ గురజాడ ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వేదిక ఏర్పాటు చేసే కార్యక్రమానికి గురజాడ మనవడు కొవ్వలి గోపాలకృష్ణ ముఖ్యఅథితిగా విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. తెలుగు భాషాభిమానులు, కవులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మూడు రోజులపాటు నగల ప్రదర్శన

హోసూరు డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోసూరు మూకొండపల్లి ప్రాంతంలోని హోటల్ హిల్స్‌లో థ్రెడ్స్ ఆఫ్‌గోల్డ్ కంపెనీ ఆధ్వర్యంలో నగల ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజులపాటు కొనసాగే ప్రదర్శనను ఎమ్మెల్యే వై ప్రకాశ్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రదర్శనల్లో వివిధ సంస్థలకు చెందిన వివిధ రకాల బంగారు, వజ్రాభరణాలు, వెండి ఆభరణాలు వివిధ డిజైన్లలో అందుబాటులో ఉంచారు. థ్రెడ్స్ ఆఫ్ గోల్డ్ వ్యవస్థాపకురాలు సంగీతా వలేచా మీడియాతో మాట్లాడుతూ మొదటిసారిగా బెంగళూరు జ్యూవెలరీ షోను హోసూరులో ఏర్పాటు చేస్తున్నామన్నారు. విశ్వసనీయమైన ఆభరణాల బ్రాండ్‌లను పరిచయడం చేయడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య స్థాయి సమితి చైర్మన్ మాదేశ్వరన్, ఇందురేఖ గౌరీశంకర్, డెంటల్ సర్జన్ దీక్షా, డెంటల్ హాస్పిటల్ కంపెనీ ప్రెసిడెంట్ మోహన్, వ్యాపారవేత్త సీతుస్ పలుహాత్, కీతులక్ష్మి, డాక్టర్ రేఖా రాజేశ్, బెంగళూరు జ్యూవెలరీ ఎగ్జిబిషన్ కో ఫౌండర్ సంగీత వలేసా, సనమ్ టెంప్లా తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్: కలెక్టర్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ సరయు

హోసూరు(కృష్ణగిరి) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్నివర్గాల ఉన్నతి కోసం శ్రమించిన రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆదర్శప్రాయులని కలెక్టర్ సరయు అభిప్రాయపడ్డారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని కృష్ణగిరి మీనాక్షి మహల్‌లో శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో వివిధ పథకాల లబ్ధిదారులకు చెక్కులు అందచేశారు. హోసూరు ఎమ్మెల్యే వై ప్రకాశ్, బర్గూరు ఎమ్మెల్యే మదియళగన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎ.సాధనకురళ్, హోసూరు కార్పొరేషన్ కమిషనర్ శ్రీకాంత్, కృష్ణగిరి దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్.షాజహాన్, ఆది ద్రావిడర్ గిరిజన సంక్షేమాధికారి రమేశ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసంగిస్తూ ఎవ్వరు తన హక్కులను కాపాడుకోవడానికి సిద్ధంగా ఉంటారో బహిరంగ విమర్శలకు భయపడకుండా, ఇతరులకు కీలుబొమ్మగా మారకుండా తగినంత ఆలోచన, ఆత్మగౌరవం ఉన్నవాడే స్వేచ్ఛా మనిషి అని డాక్టర్ అంబేడ్కర్ అభిప్రాయపడ్డారన్నారు. అణగారిన వర్గాల కోసం నాయకుడిగా ఉండటమే కాకుండా అందరికీ నాయకుడిగా డాక్టర్ అంబేద్కర్ నిలిచారన్నారు. మానవ సమాజ అభివృద్ధి గురించి ఆలోచిస్తూ తన జీవితంలో గణనీయమైన భాగాన్ని గ్రంథాలయాల్లో గడిపారన్నారు. రాజకీయాలు, సాహిత్యం, తత్వశాస్త్రం, చరిత్ర, మతం, చట్టం, ఆర్థిక శాస్త్రం మానవ విజ్ఞానానికి సంబంధించిన అంశాలపై పరిశోధనలు చేసి ప్రపంచం మెచ్చేలా రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో ఆది ద్రావిడ సంక్షేమ శాఖ తరపున 142 మంది లబ్ధిదారులకు రూ.2.36 కోట్ల విలువైన ఇళ్ల పట్టాలు, 15 మందికి కుట్టు మిషన్లు, దివ్యాంగుల వికలాంగుల సంక్షేమ శాఖ తరపున నలుగురికి త్రిచక్ర స్కూటర్లు, మున్సిపల్ కార్పొరేషన్ తరపున 22 మంది పౌరకార్మికులకు ఆయుష్మాన్ భారత్ కార్డు, 25 మంది పౌరకార్మికులకు పరికరాలు అందజేశారు.

డీఎంకే ఆధ్వర్యంలో..

హోసూరు (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. 68వ వర్ధంతిని పురస్కరించుకుని డీఎంకే జిల్లా విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. డీఎంకే జిల్లా అధ్యక్షుడు వనవేందన్, నగర అధ్యక్షుడు రమేశ్, యూనియన్ ఆర్గనైజర్ భూపతి, ఎలిల్, సుగన్‌ఎళిల్, నగర డిప్యూటీ మేయర్ ఆనందయ్య, డీఎంకే అగ్రికల్చర్ టీమ్ జిల్లా ఉపాధ్యక్షుడు రామచంద్రన్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మురళీధరన్, నగర అధ్యక్షుడు త్యాగరాజన్, విసికా నగర కార్యదర్శి కృష్ణన్, సీసీఎం జిల్లా కమిటీ జయరామన్ సేదుమాదవన్, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అన్నానగర్ ఆర్చ్ వద్ద అంబేడ్కర్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సంతోష్, కార్యదర్శి శేఖర్, అన్నాడీఎంకే ఎంజీఆర్ కౌన్సిల్ జిల్లా ఉప కార్యదర్శి మురుగన్, విసిక కృష్ణన్, రవి, శ్రీరామ్, అచ్చు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న డీఎంకే నాయకులు

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కుడితిని గ్రామ పెద్దలు

కంప్లి, డిసెంబరు 6(ఆంధ్ర జ్యోతి): క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని కుడితిని సబ్ ఇన్‌స్పెక్టర్ శాంతమూర్తి అన్నారు. కుడితిని పట్టణంలో శుక్రవారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతి, కుమార్, మంజునాథలకు గుర్తుగా క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రికెట్ క్రీడల వల్ల ఆరోగ్యాలు పెంపొందుతాయన్నారు. అలాగే స్నేహబంధం పెరుగుతుందని తెలిపారు. ఈ క్రీడల వల్ల మానసిక ఒత్తిళ్లు తగ్గి చెడు అలవాట్లకు దూరమవుతారన్నారు. కుడితినికి చెందిన వినోద్, నిరంజన్, పరమేష్, శేఖర్, శంకర్ క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సత్యప్ప, వి రాజశేఖర్, గురుమూర్తి, వెంకటరమణ బాబు, చంద్రయ్య దొడ్డ బసప్ప, లోకేష్, దివాకర్, గంగాధర్, వీరేంద్రప్రసాద్, వెంకటేష్, దేవేంద్ర పాల్గొన్నారు.

కలశ ప్రతిష్ఠాపన

కంప్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) పట్టణంలో పేట బసవేశ్వర, నీలమ్మ రథోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మార్గశిర శుద్ధ పంచమి షష్టి సందర్భంగా రథాలకు పేట బసవేశ్వర, నీలమ్మ జోడు రథాలకు కలశధారణ ప్రతిష్ఠాపన సిద్దరామేశ్వర శాస్త్రి, చంద్ర శేఖరయ్య స్వామి చేపట్టారు.



కలశాలకు పూజలు చేస్తున్న పురోహితులు